

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఇంకోసారి

"వదినా"

అరుపులాంటి పిలుపు విని సమీర ఆగి తల తిప్పి చూసింది. చంద్రిక పరుగున వచ్చి చెయ్యిపట్టుకుంది.

"వదినా దూరం నించి చూసి నువ్వా కాదా అనుకున్నా. నువ్వే" నవ్వింది.

"చంద్రా. నువ్వేంటి ఇక్కడ?" సమీర విస్మయంగా అడిగింది.

చంద్రిక కళ్ళు నీళ్ళతో నిండుకున్నాయి.

"అమ్మకేం బాలేదు వదినా హార్ట్ ప్రాబ్లం. మూడు వాల్వ్స్ పాడయ్యాయట. సర్జరీ చేయాలన్నారు. ఈ హాస్పిటల్‌లో సి జి హెచ్ ఎస్ ఉందని ఇక్కడ చేర్పించాం" దిగులుగా చెప్పింది.

"అరెరె! అత్తయ్య చాలా క్రమశిక్షణగా ఉంటారే"

"వస్తావా వదినా రూముకి?" చంద్రిక సంకోచంగా అడిగింది.

"పద వెళ్దాం."

చంద్రిక వెనకే లోపలకి వచ్చిన సమీరని చూసి శారద నిర్ఘాంతపోయింది. చదువుతున్న స్వాతిని పక్కన పెట్టి మెల్లిగా లేచి కూర్చుంది.

"పర్లేదు. పడుకోండి."

సమీర పక్కనే ఉన్న సోఫాలో కూర్చుంది.

"నేను జాగ్రత్తగానే ఉన్నా, వంశంలో ఉన్న జబ్బిది. నాకూ వచ్చేసింది" శారద బలవంతంగా నవ్వింది.

"మంచి మందులు వచ్చాయి. అధైర్యపడకండి" సమీర చెప్పింది.

"అమ్మా కేంటిన్‌కి వెళ్తూంటే దారిలో వదిన కనిపించింది. నీకు బాలేదంటే చూద్దామని వచ్చింది" చంద్రిక సంజాయిషీగా చెప్పింది.

"రేపు వస్తాను మళ్ళీ" సమీర లేచి నిలబడింది.

చంద్రికకూడా ఆమెతో లిఫ్ట్‌లోకి నడిచింది.

"నువ్వేం చేస్తున్నావ్ చంద్రా?" సమీర అడిగింది.

"డిగ్రీ తర్వాత ప్రైవేట్ జాబ్ చేసాను వదినా. అమ్మకి బాలేదని మానేసి ఇంట్లోనే ఉన్నా. కెరీర్ మీద దృష్టి పెట్టు ' అని చెప్పేదానివి కదా! అప్పుడప్పుడూ అనుకుంటూంటాను వదిన చెప్పినట్లు కెరీర్ మీద ఫోకస్ చేస్తే బావుండేదని" చెప్పింది.

"పర్లేదు అమ్మకి తగ్గాక ఫోకస్ చేయచ్చు" సమీర అభిమానంగా చెప్పింది.

తరుణ్‌తో పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిన సమీరకి మొదటగా నచ్చిన వ్యక్తి చంద్రిక. తనకంటే నాలుగేళ్ళు చిన్నదైన చంద్రిక చిన్న చెల్లెల్లా అనిపించేది. ముందురోజు ఎంత అలసిపోయినా, ఆ రోజు ఎంత పనివున్నా తెల్లారి ఐదుగంటలే లేచి వాకింగ్‌కి వెళ్ళొచ్చే అత్తగారిని చూస్తే ఆరాధనగా ఉండేది. అన్నం తక్కువ కూరలు ఎక్కువ తినడం, తక్కువ నూనె, నెయ్యి వాడడం, పడుకోడానికి రెండు గంటల ముందు రాత్రి భోజనాలు ముగించడంలాంటి ఆవిడ పాటించే ఆరోగ్య సూత్రాలని తల్లికి చెప్పి ఆవిడనీ పాటించమనేది. మామగారు మితభాషి. ఇల్లు, ఆఫీస్. మెత్తగా మాట్లాడతారు. తన పుట్టింట్లో అంతా పెద్దగా గోలగా మాట్లాడుకునేవాళ్ళు. ఇక్కడ ఈ నిశ్శబ్దం ఆమెకి ఆశ్చర్యంగా ఒక్కోసారి విసుగ్గా ఉండేది. ఇంట్లోని మరో వ్యక్తి విశ్వం బాబాయ్. మామగారి తమ్ముడు. పిజి చదివేప్పుడు ఆయనకి ఏదో చేదు అనుభవం కలిగిందని, దాంతో మనిషి అలా అయిపోయారని తరుణ్ చెప్పాడు. తనకి చాలా సందేహాలున్నా మొహమాటంతో అడగలేదు. వరసకి తనకి మామగారే అయినా తరుణ్‌లా తనుకూడా బాబాయ్ అనే పిలిచేది. మనుషులు ఏ పని చేయకుండా అలా మౌనంగా ఎలా ఉంటారో అని సమీరకి తగని ఆశ్చర్యంగా ఉండేది. విశ్వం పొద్దున్నే, అంతా నిద్రలేచేలోపలే నిద్రలేచి స్నానం ముగించి బయట వరండాలో కూర్చుని పేపర్ చదువుతూండేవాడు. కాఫీ ఇస్తే తాగేవాడు. బ్రేక్‌ఫాస్ట్‌కి పిలిస్తే వచ్చి తినేసి మళ్ళీ వరండాలో కూర్చునేవాడు. మధ్యాహ్నాలు శారద వడ్డించి 'అన్నం తిందాం విశ్వం' అని పిలిస్తే వచ్చి శారద, సమీరలతో కలిసి భోంచేసేవాడు. తర్వాత మౌనంగా వరండాలో కూర్చునేవాడు. సాయంత్రం ఎవరైనా టి.వి పెడితే వచ్చి కూర్చుని చూసేవాడు. ఛానెల్ మార్చినా పట్టించుకునేవాడుకాదు.

ఆయన్ని చూస్తే సమీరకి తగని జాలిగా ఉండేది. ఒక మనిషి ఎనర్జీ అంతా పోయి అలా నిస్తేజంగా ఎందుకున్నాడో, ఆయన మనసులోని ఆ బాధ ఏమిటో తెలుసుకోవాలని తపించిపోయింది కాని అత్తగారు ఏమైనా అనుకుంటారేమోనని జంకి ఆయన గురించి మాట్లాడేది కాదు.

తరుణ్! పెళ్ళయి ఏడాదైనా తరుణ్ మంచివాడో, చెడ్డవాడో సమీర తేల్చుకోలేకపోయింది. అవకాశవాది, స్వార్థపరుడని మాత్రం గ్రహించింది. మగపిల్లవాడుగా, తండ్రి కంటే ఎక్కువ సంపాదించేవాడుగా ఆ ఇంట్లో తరుణ్‌కి ఓ ప్రత్యేక స్థానం ఉంది.

"తరుణ్ కారం తినడు. ఎక్కువేస్తావేమో జాగ్రత్త"

"తరుణ్‌కి బాత్‌రూం డ్రైగా వుండాలి. వాడు  స్నానం చేసాక్ నువ్వు చెయ్యి"

"తరుణ్ వచ్చే టైమైంది. టి.వి సౌండ్ తగ్గించు"

ఇలా ఇంట్లో తరుణ్ నామస్మరణ విని సమీరకి ఆశ్చర్యంగా ఉండేది. 'ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే ' అన్న సామెత తెలుసు ఆమెకి. అది నిజం అనికూడా నమ్ముతూ వచ్చింది. కాని ఎక్కువ సంపాదించే కొడుకుని రాజులా చూడడం ఇక్కడే తొలిసారి చూసింది.

సమీరకి చదువుకోవాలి, ఉద్యోగం చేయాలనే కోరికలు ఉండేవి. పెళ్ళిచూపుల్లో తరుణ్‌కి ఆ విషయం స్పష్టంగా చెప్పింది. అతను ఒప్పుకున్నాడు. డిగ్రీ రిజల్ట్స్ రాగానే కరస్పాండెన్స్ కోర్స్‌లో ఎం.ఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో చేరింది. ఇంట్లో పనులయ్యాక మధ్యాహ్నాలు ఆ మెటీరియల్ ముందు పెట్టుకుని చదువుతూండేది. విశ్వం ఆసక్తిగా వాటిని తీసుకుని తిరగేస్తూండేవాడు. 'మీరు ఏ సబ్జెక్ట్ చదివారు బాబాయ్?' అని ఓసారి అడిగితే ఆయన మౌనంగా వెళ్ళిపోయాడు.

చదువు మీద ఆసక్తిలేని చంద్రికని బలవంతంగా చదివించేది. సాయంత్రం ఓ గంట కలిసి చదువుకుందామని ఒప్పందం చేసుకుంది.

ఆ ఇంట్లో సమీరకి రోజులు ఆనందంగానే గడుస్తున్నాయి. అత్తమామలు సాత్వికులు, చంద్రిక మంచిపిల్ల. విశ్వం ఉన్నా లేనట్లే. కాని సమస్య తరుణ్‌తోనే వచ్చింది.

తరుణ్ తనతో మునుపటిలా లేడని సమీర గ్రహించింది. మాట్లాడడం తగ్గించాడు. ఆఫీస్‌లో ఎక్కువ సమయం ఉంటున్నాడు. అప్పుడప్పుడూ చిరాకుపడుతున్నాడు. పని వత్తిడి అని సమర్థించుకుంది. కానీ ఏదో అసంతృప్తి. చివరికి ఓ అర్ధరాత్రి తరుణ్ అడిగాడు.

"నిద్రపోతున్నావా?"

"లేదు. చెప్పండి."

"ఐ యాం సారీ"

"ఎందుకు?"

కొద్దిసేపు మౌనం తర్వాత చెప్పాడు.

"నాకు కోకిలంటే ఇష్టం."

సమీరకి ఓ క్షణం అర్థం కాలేదు. అయ్యాక అడిగింది.

"మనిషా? పక్షా?"

"మనిషి. అందమైన అమ్మాయి."

సమీర ఒక్క ఉదుటన లేఇచి కూర్చుంది.

తరుణ్ తలకింద రెండు చేతులు ఉంచుకుని పైన తిరిగే ఫేన్ వంక చూస్తూ చెప్పాడు.

"ఐ లవ్ హర్."

"నన్నూ ఇష్టపడేగా చేసుకున్నారు?"

"అవును. కానీ నాకిప్పుడు కోకిలంటే ఇంకా చాలా ఇష్టం."

సమీరకి కొత్త బొమ్మ కోసం ఏడ్చే పసివాడు గుర్తొచ్చాడు.

"ఐతే ఏమంటారు?" నిస్సత్తువుగా అడిగింది.

"కోకిల ఆర్నెల్ల క్రితమే మా ఆఫీస్‌లో చేరింది. 'బావుందే' అనుకున్నాను. పరిచయం తర్వాత తన మనసుకూడా చాలా మంచిదని అర్థమైంది.."

"నా మనసు మంచిది కాదా?"

"మంచిదే కాని కోకిల నీకంటే మంచిది. నీకంటే అందగత్తె."

సమీర రెండు నిమిషాలు మౌనంగా ఉన్నాక అడిగింది.

"ఆర్నెల్ల తర్వాత ఇంకో హంస ఇంకా అందంగా ఉంటే?"

"లేదు లేదు. కోకిలే నా సర్వస్వం. ఆమే నా లోకం."

"ఇదంతా ఇప్పుడు నాకెందుకు చెప్తున్నారు?" అనుమానంగా అడిగింది.

"నీకు విడాకులిచ్చి కోకిలని పెళ్ళి చేసుకుందామనుకుంటున్నా"

సమీర పెద్దగా ఆశ్చర్యపోలేదు. ఈ సంభాషణ ఎక్కడికి దారి తీస్తుందో? ఆమె ముందే గ్రహించింది.

"ఇవాళ సాయంత్రం కోకిల గట్టిగా చెప్పింది" పొరపాట్లు జరుగుతుంటాయి. నువ్వు విడాకులు తీసుకుంటే నిన్ను పెళ్ళి చేసుకోడానికి నేను రెడీ" అని.

"నేను పొరపాటునా?"

"ఏదో ఒకటి. పెళ్ళయిన ఏడాదికే విడాకులంటే మీ పేరెంట్స్ ఏమంటారో నువ్వే వాళ్ళకి ఏదో ఒకటి చెప్పుకో. ఈ రోజుల్లో ఇష్టంలేని కాపురాలేంటి? మనం విడాకులు తీసుకుందాం."

"మీ పేరెంట్స్ ఏమీ అనరా?"

తరుణ్ నవ్వాడు. ఆ నవ్వులో సమీరకి పొగరు, అహంభావం కనిపించాయి.

"నువ్వు చెడ్డదానివి ఎట్సెట్రా చెప్పి కోర్ట్ కెక్కడం నాకిష్టంలేదు. నీమీద నాకెలాంటి నెగెటివ్ ఫీలింగ్స్ లేవు. మనమో లాయర్ని కలిసి మ్యూచ్యువల్‌గా డివోర్స్ తీసుకుందాం" సూచించాడు.

"థాంక్స్.. అలాగే" సమీర తలాడించింది.

మర్నాడు బ్రేక్‌ఫాస్ట్ సమయంలో తరుణ్ తండ్రితో చెప్పాడు.

"నాన్నా. ఒక్క నిమిషం. మీతో మాట్లాడాలి."

తిని లేచి వెళ్ళిపోబోతున్న ఆయన మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు.

"అమ్మా" తరుణ్ పెద్దగా పిలిచాడు.

శారద స్టవ్ ఆపేసి గబగబా వచ్చింది.

"నేను సమీర విడాకులు తీసుకుంటున్నాం" తరుణ్ ఇడ్లీ ముక్కని చట్నీలో ముంచుతూ చెప్పాడు.

వాళ్ళు నిర్ఘాంతపోతూ సమీర వైపు చూసారు. అతనంత త్వరగా పెద్దవాళ్ళకి చెప్తాడని ఊహించని సమీర విభ్రాంతిగా చూసింది. రాత్రి సంభాషణని ఆమె సీరియస్‌గా తీసుకోలేదు. నిదానంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలి అనుకుంది.

"మీరా తప్పేం లేదు. నేను ఆఫీస్‌లో ఒకమ్మాయిని ప్రేమించాను. విడాకులు వచ్చాక తననే పెళ్ళిచేసుకుంటాను" చెప్పేసి తన పనైందన్నట్లుగా తరుణ్ లేచి వెళ్ళిపోయాడు.

అంతా నిశ్శబ్దంగా ఉండిపోయారు. తరుణ్ బెడ్రూములో ఏదో సర్ధుకుంటున్నాడు. డైనింగ్ టేబుల్ దగ్గరనుంచుని ఉన్న సమీర కుర్చీలో కూలబడి అత్తమామలవైపు చూసింది. ఓ నిమిషం తర్వాత మామగారు లేచి బయటకి వెళ్ళిపోయారు. శారద వంటగదిలోకి నడిచింది.

సమీర భుజం మీద చెయ్యి పడింది. తలెత్తి చూస్తే విశ్వం.

"ఐ యాం సారీ" సానుభూతిగా చెప్పి వెళ్ళి వరండాలో కూర్చున్నాడు.

ఆ మధ్యాహ్నమే సమీర తన వస్తువులు సర్దుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. తన కూతురు ఏం తప్పు చేయకపోయినా ఇలా చేయడం ఏమిటని సమీర తండ్రి కోపంగా అరిచాడు. 'వాళ్ళకీ ఒక ఆడపిల్లుంది. ఇంత అన్యాయం

చేస్తారా?' అని తల్లి బాధపడింది. అత్తగారు తనతో మాట్లాడడానికి ప్రయత్నించకపోవటం, చంద్రిక కూడా మౌనంగా ఉండటం సమీరకి ఆశ్చర్యంగా అనిపించింది. కాని ఇంట్లో తరుణ్‌కి వాళ్ళిచ్చే విలువ గౌరవం గుర్తొచ్చి అతనికి భయపడ్డారేమో అనుకుంది.

విడాకులైన నాలుగేళ్ళ తర్వాత మొదటిసారి చంద్రిక కలిసింది.

మర్నాడు మళ్ళీ వెళ్ళింది సమీర. చంద్రిక లేదు. మామగారు ఉన్నారు. ఆయన సమీరని చూసి తడబడి లేచి నుంచున్నాడు. సమీర పలకరింపుగా నవ్వి, శారద దగ్గరకి వెళ్ళి ఆప్యాయంగా అడిగింది.

"ఎలా ఉన్నారు?"

"బానే వున్నాను. రెండు రోజుల్లో సర్జరీ అంటున్నారు. ఆవిడ బేలగా చెప్పింది.

"భయంలేదు ఓపెన్ హార్ట్ సర్జరీ అంటే వారంలో ఇంటికి పంపేస్తారు. ఆరునెలల్లో మీరు మళ్ళీ వంట చేసేయగలరు" ఓదార్చింది.

మూడోరోజు చంద్రిక కనిపించింది.

"వదినా! ఏం చేస్తున్నావు?" మొహమాటంగా అడిగింది.

సమీర నవ్వింది.

"సారీ" చంద్రిక గొణిగింది.

"నేనీ హాస్పిటల్‌లోనే పనిచేస్తున్నా చంద్రా" చెప్పింది.

"ఇక్కడేం జాబ్?"

"నేను పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చదివాను కదా, అడ్మిన్‌లో పనిచేస్తున్నా"

"నువ్వు చదువు కంటిన్యూ చేసావా వదినా?" చంద్రిక ఆశ్చర్యపోయింది.

"మరేం చేయాలి? ఇరవై రెండేళ్ళ డివోర్సీని  కనీసం చదువుకూడా లేకపోతే ఎలా?" సమీర సన్నగా నవ్వింది.

గదిలో ఇబ్బందికరమైన వాతావరణం అలుముకుంది.

"వెళ్తాను. రేపు సర్జరీకి ప్లాన్ చేస్తున్నారు. టైం ఇంకా తెలీదు. రేపు సాయంత్రం కలుస్తాను" సమీర వెళ్ళిపోయింది.

ఆపరేషనై రూముకి మార్చాక వచ్చింది సమీర.

"ఎలా ఉన్నారు? సారీ నాలుగురోజులుగా బిజీగా ఉన్నాను. రాలేకపోయాను."శారదతో చెప్పింది.

ఆవిడ బానే వున్నాను అన్నట్లుగా తలాడిమించింది.

విజిటర్స్ టైం అవడంతో గదిలో తరుణ్, విశ్వంకూడా ఉన్నారు. విశ్వంని చూసి చిరునవ్వు నవ్వింది. ఆయన తలాడించాడు. తరుణ్ వైపు చూడకుండా వెళ్ళిపోయింది.

శారదని డిశ్చార్జ్ చేసే రోజు వెళ్ళింది మళ్ళీ. కుటుంబమంతా ఉన్నారు.

"సమీరా. ఒకటి అడుగుతా. నా మాట మన్నిస్తావా?" శారద ఆమె చేతిని పట్టుకుని అడిగింది.

అదేమిటో సమీర ఊహించలేకపోయింది.

తరుణ్ ఇబ్బందిగా లేచి బయటకి వెళ్ళిపోయాడు.

"చెప్పండి" సమీర మృదువుగా అడిగింది.

"నువ్వు మళ్ళీ కోడలుగా మా ఇంటికి వస్తావా?"

సమీర నిర్ఘాంతపోయింది.

"మేము నీకంత అన్యాయం చేసినా అవేం గుర్తుపెట్టుకోకుండా వచ్చావు. చంద్ర వదినా అంటే పలికావు. నిన్ను నేను ఒక్కమాట కూడా అనలేదు. ప్రేమగానే చూసుకున్నా కదా?" శారద ఆరాటంగా అడిగింది.

"కోకిల?" సమీర తేరుకుంటూ అడిగింది.

"విడాకులు తీసుకున్నవాడితో కూతురికి రెండో పెళ్ళి చేయనని వాళ్ళ నాన్న ఒప్పుకోలేదు వదినా. కోకిల వాళ్ళ నాన్న మాట విని వేరే అబ్బాయిని పెళ్ళిచేసుకుని అమెరికా వెళ్ళిపోయింది" చంద్రిక చెప్పింది.

సమీరకి నవ్వొచ్చింది. నవ్వేసింది. మామగారు కూడా బయటికి వెళ్ళిపోయారు.

"మీరు చెప్పింది నిజం. మీరు నన్ను అభిమానంగానే చూసారు. చంద్ర నాకు చెల్లితో సమానం. కానీ నాకు అన్యాయం జరిగినప్పుడు తరుణ్ ప్రవర్తన కన్నా మీ మౌనం నన్ను ఎక్కువ బాధించింది. మీ అబ్బాయి మీకు హీరో కావచ్చు కాని ఒక ఆడపిల్లకి అన్యాయం చేస్తూంటే, 'అదేంట్రా' అనలేకపోయారు. 'వదినా' అని వెనకే తిరిగే చంద్ర కనీసం ఫోన్ కూడా చేయలేదు. మీ అబ్బాయికి ఇంకో అమ్మాయి నచ్చదని గేరంటీ లేదు. అప్పుడూ మీరు మౌనంగానే ఉంటారు. రోజూ మిమ్మల్ని పరామర్శిస్తూండటంతో మీరు నేను గతం మర్చిపోయాననుకున్నారు. కాని ఇది నా సంస్కారం అనుకోలేదు."

సమీర మరోసారి నవ్వి చెప్పింది. నాలుగేళ్ళుగా నేను సింగిల్‌గా ఉన్నానని మీరు ఎలా అనుకున్నారు? "నా పెళ్ళయిపోయింది. తను ఈ హాస్పిటల్లోనే డాక్టర్. మాకు ఏడాది బాబు కూడా ఉన్నాడు.

శారద చెయ్యి పట్టుసడలింది. సమీర మౌనంగా బయటకి నడిచింది. తలుపు దగ్గర నుంచున్న విశ్వం చెప్పాడు.

"అప్రిషియేట్ యూ"

సమీర పెద్దగా నవ్వి చెప్పింది.

"ఈ ఫేమిలీలో మీరే నార్మల్ బాబాయ్." ***(వచ్చే సంచికలో మరో సరిగమ)***